క్లుప్తంగా

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు



పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: విద్యార్థులు కంటి సమస్యలపై ఎటువంటి అశ్రద్ధ వహించవద్దని కంటి వైద్యుడు కె.అరవింద్ సూచించారు. మండలంలోని పామర్రు పీహెచ్‌సీ పరిధిలోని 19 ప్రాథమిక పాఠశాలలు, 4 ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో కంటి సమస్యలు గుర్తిస్తే ఎటువంటి సమస్యలు రావన్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 15 మంది విద్యార్థులను గుర్తించి వారిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. యంపీహెచ్‌ఈఓ మల్లికార్జునుడు, యంఎస్ఎన్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కల్యాణ్ మృతిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు శివారు రాచబంధ పంటపొలాల్లో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కాటి కళ్యాణ్ (25) మృతిపై అతని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బుధవారం గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ తెలిపిన వివరాల ప్రకారం తమ కుమారుడు కల్యాణ్ కె.గంగవరం మండలం ఎర్రపోతవరానికి చెందిన ఓ వివాహితతో సంబంధం ఉందని కల్యాణ్ మృతికి ఆమె, ఆమె తరఫు వ్యక్తులు కారణమై ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తండ్రి సుబ్బారావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శెట్టిబలిజ సమావేశాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: కాజులూరు శివారు చాకిరేవుమెరకలో గురువారం జరుగనున్న మండల స్థాయి శెట్టిబలిజ సంక్షేమ సంఘం సమావేశాన్ని సభ్యులు విజయవంతం చేయాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని రామాలయం ఆవరణలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే ఈ సమావేశంలో సంఘానికి చెందిన పలువురు ముఖ్యనాయకులు పాల్గొని సంఘ పురోగతిపై చర్చిస్తారన్నారు. సభ్యులందరూ విధిగా హాజరు కావాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబీకులకు నిత్యావసరాలు అందజేస్తున్న జనసేన నాయకులు

కాజులూరు: గొల్లపాలెంలో ఇటీవల మృతి చెందిన పోతురాజు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ నియోజక ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు బాధిత కుటుంబీకులను పరామర్శించి డొక్కా సీతమ్మ ఆసరా పథకంలో భాగంగా పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేశారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

రామచంద్రపురం: పట్టణంలోని మార్కెట్ వీధిలో వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి 49 వ కల్యాణ మహోత్సవాలు నేడు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.27 గంటలకు కలశ స్థాపన, జెండా ప్రతిష్ఠాపన, రాత్రి 9.20 గంటలకు స్వామివార్ల దివ్య కల్యాణం, సదస్యం, నాగవల్లి, పూర్ణాహుతి, 18 న మహాశివరాత్రి పురస్కరించుకుని రుద్రాభిషేకం, 28న అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎడ్ల పరుగు పందేలకు సర్వం సిద్ధం

ఆలమూరు: రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాల పోటీలకు మండలంలోని గుమ్మిలేరు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 32 జతల ఎద్దులు గ్రామానికి చేరుకోగా నిర్వాహకులు తగిన వసతులు కల్పించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలు బహూకరించనున్నారు. జూనియర్ విభాగంలో ఏడు జతలు, సీనియర్ విభాగంలో 25 జతలు పాల్గొననున్నాయి. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఎడ్ల పోటీలు గురువారం జరగుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

చివరి వరకూ సాగేలా..

- తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు మరమ్మతులు
- రూ.8.80 లక్షల మంజూరు
- 10 వేల ఎకరాలకు సాగునీరు

కపిలేశ్వరపురం: రబీ వరిసాగు చివరి వరకూ సజావుగా సాగేలా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. సాగు ప్రక్రియ ప్రారంభం నుంచి పంట కోతకు వచ్చే వరకూ కావాల్సిన అవసరాలను గుర్తించింది. ప్రస్తుతం నీటి ఎద్దడి లేకపోయినా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాతపూడి పంపింగ్ స్కీమ్‌ను సిద్ధం చేస్తోంది. పంపింగ్ స్కీమ్ మరమ్మతులకు కలెక్టర్ రూ.8.80 లక్షలను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పంపింగ్ స్కీమ్ ప్రాధాన్యత, సాగునీటి పరిస్థితులపై ఈ కథనం..

సాగునీటి అవసరం ఇలా..

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీమీటర్ల నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 53,249 ఎకరాలకు 6,65,61,250 మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలకు 11,58,33,750 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది. ఆలమూరు నుంచి కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, మాచర, శ్రీరాంపురం, కోరుమిల్లి మీదుగా కె.గంగవరం మండలం కూళ్ల వైపు బ్యాంకు కెనాల్ ఉంది. ఈ కెనాల్ పరిధిలో నీటి సరఫరాలో సమస్య వచ్చినప్పుడు తాతపూడి పంపింగ్ స్కీం ద్వారా నీటిని అందిస్తుంటారు.

తాతపూడి పంపింగ్ స్కీం నేపథ్యమిదీ..

కపిలేశ్వరపురం మండలంలో తాతపూడి, కపిలేశ్వరపురం, మాచర, టేకి, వాకతిప్ప, కోరుమిల్లి, రామచంద్రపురం మండలంలో కె.గంగవరం కూళ్ల, యండగండి, పామర్రు గ్రామాల ఆయకట్టుకు ఏకదాటిగా సుమారు 10 వేల ఎకరాలకు నీరందిరచే సామర్థ్యం తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు ఉంది. 1969లో రూ.9.20 లక్షల వ్యయంతో పంపింగ్ స్కీమ్‌ను ఏర్పాటు చేశారు. ఆటో ట్రాన్స్‌ఫర్మేషన్ స్టార్టర్స్‌తో హెచ్‌పీ 125 పీహెచ్ 50సీ/ఎస్ సామర్థ్యంతో ఏడు పంపులను అమర్చారు. 500 ఓల్ట్స్ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లతో ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పంపింగ్ స్కీం అనుసంధానమైంది. 2009కు ముందు తొమ్మిదేళ్లపాటు పంపింగ్ స్కీమ్ నిర్లక్ష్యానికి గురి కాగా పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో వాకతిప్ప, కపిలేశ్వరపురానికి చెందిన రైతులు అల్లూరి రామకృష్ణచౌదరి, నామాల అచ్యుతరామయ్య 2009 నవంబరులోనూ, ఆ తర్వాత పలుమార్లు నిరాహారదీక్ష చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వం 2010 డిసెంబర్ 9న పునరుద్ధరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హామీ అమలు కోరుతూ 2011 మార్చిలో మరోసారి అల్లూరి ఆమరణ దీక్ష చేపట్టారు.



తాతపూడి పంపింగ్ స్కీం

> **వారం రోజుల్లో వినియోగంలోకి తెస్తాం**
>
> ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపింగ్ స్కీమ్‌కు మరమ్మతులు చేపట్టి వారం రోజుల్లో వినియోగంలోకి తీసుకొస్తాం. 2019, 2020, 2021 ఫిబ్రవరిల్లో కష్ట కాలంలో పంపింగ్ స్కీమ్ ద్వారా నీటి సరఫరా అయ్యింది. ప్రస్తుతం రబీకి సైతం అవసరం ఉందని గుర్తించాం. మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.
>
> – విశ్వనాథరాజు, ఏఈ, హెడ్ వర్క్స్



సోమేశ్వరుడికి రుద్రయాగం



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరుడు

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో పంచాయతన సహిత మహారుద్ర యాగం వైభవంగా సాగుతోంది. దీనిలో భాగంగా నాలుగో రోజు బుధవారం వేదపండితులు చంద్రాభట్ల రఘురామశర్మ, ఇంజమూరి శ్రీరామసుబ్రహ్మణ్యశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, సుమారు 100 మంది ఋత్విక్‌లు మహారుద్రయాగాన్ని నిర్వహిస్తున్నారు. 22 సంవత్సరాల అనంతరం విశ్వశాంతి, లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ యాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు.

బ్లాక్ మెయిలర్లను ఉపేక్షించేది లేదు

- బ్లాక్ మెయిలర్లను ఉపేక్షించేది లేదు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజలను పట్టి పీడిస్తున్న బ్లాక్‌మెయిలర్లను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని, వారి మెడలు వంచుతానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. మండపేటలో ఇద్దరు బ్లాక్‌మెయిలర్స్ ఆట కట్టించిన నేపథ్యంలో రోజూ వందల మంది తనకు ఫోన్లు చేసి అభినందనలు చెబుతున్నారన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడారు. మండపేటలో ఎన్నో ఏళ్లుగా గాడు సత్యనారాయణ, హుస్సేన్ ఆర్‌టీఐ చట్టం పేరిట భవన నిర్మాణాలు చేసుకునే వారిని బెదిరించి లక్షలాది రూపాయలు వసూలు చేశారన్నారు. వారికి భయపడో, లేక డబ్బుల కోసమో కొందరు మున్సిపల్ ఉద్యోగులు బ్లాక్‌మెయిలర్స్‌కు సహకరించారన్నారు. గత పాలకులు వీరి ఆగడాలను పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. తమది పేదల ప్రభుత్వమని, పేదల హక్కులు కాపాడడమే తమ లక్ష్యమన్నారు. వీరి ఆగడాలు గురించి తన దృష్టికి వచ్చినప్పుడు జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డితో మాట్లాడానని, పోలీసులు వెంటనే స్పందించి వారి ఆగడాలకు తెరదించారన్నారు. మండపేట ప్రజలు, బాధితుల తరుపున ఎస్పీ సురేందర్‌రెడ్డి, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ పి.శివగణేష్‌లకు ఎమ్మెల్సీ తోట కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పనపాడు, పలు గ్రామాల్లోను బ్లాక్ మెయిలర్లు ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని, ప్రజలు బాధ్యతతో మెలిగి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చిత్రంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

టిడ్కో ప్లాట్లపై చవకబారు రాజకీయాలు

పట్టణంలోని టిడ్కో ప్లాట్లపై ఎమ్మెల్యే వేగుళ్ల చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. ప్లాట్ల వద్ద వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వంపై బురదజల్లడమే ఎమ్మెల్యే వేగుళ్ల పనిగా పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. టిడ్కో ప్లాట్లపై ఎమ్మెల్యే వేగుళ్ల బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఇప్పటికే రెండు వేల మంది లబ్ధిదారులకు ప్లాట్లు స్వాధీనం చేయగా దాదాపు 350 మంది ప్లాట్లలో నివసిస్తున్నారన్నారు. వారందరికీ తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. 900 ప్లాట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్లాట్లలోకి రాకుండనే ట్యాప్‌లు పెడుతుంటే వాటిని చోరీ చేస్తున్నారని, దీనివల్ల నీరు వృథాగా పోయి ట్యాంకు ఖాళీ అయిపోతోందని అధికారులు అంటున్నారన్నారు. లబ్ధిదారులు ప్లాట్లలోకి రాగానే మున్సిపల్ సిబ్బంది ట్యాప్‌లు బిగిస్తుమన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల వాస్తవాలను వక్రీకరించడం మానుకోవాలన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

ద్వారపూడి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం అడ్డంగా ఉన్న చెట్లు తొలగింపు పనులు మొదలయ్యాయని తోట అన్నారు. అవి పూర్తయిన వెంటనే రెండో వైపు సీసీ రోడ్డు పనులు చేపడతారని ఎమ్మెల్యే వేగుళ్ల తెలిపారు. వైస్ ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, మండపేట అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వేములపల్లిలో స్థల సేకరణపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

మండపేట: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వేములపల్లిలోని జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వేములపల్లి ప్రాంత ప్రజలు, కాలనీవాసుల లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. అందుకోసం బుధవారం ప్రత్యేకాధికారి ఓ రామకృష్ణ, ఎంపీడీఓ ఐ.రాజు, తహసీల్దార్ టి.రాజేశ్వరరావులతో కలిసి ఎమ్మెల్సీ తోట స్థల పరిశీలన చేశారు. ఈ ప్రాంతం టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందనుండడంతో పారిశుధ్య నిర్వహణ కోసం రెండు ఎకరాల్లో డంపింగ్‌యార్డు నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. అలాగే వేములపల్లిలో శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా అధికారులతో కలిసి శ్మశాన వాటికకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. త్వరితగతిన స్థల సేకరణ ప్రక్రియ పూర్తి చేసి ఆయా శాఖలకు చెందిన అధికారులకు స్థలాలను అప్పగించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ ఈత కోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు తులా శ్రీరంగారావు, పోతుల రాంబాబు, తొంటా సత్తిబాబు, పోలినాటి సత్యనారాయణ, కొండపల్లి ప్రసాద్, పోతుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రకృతిపై 'సాలీడు' సంతకం



ముత్యాల్లా మెరుస్తున్న సాలిగూడు

ఇంజినీర్స్‌ను తలదన్నే విధంగా గిజిగాడు తన గూడును నిర్మించుకుంటాడు. గిజిగాడుకు ఏ మాత్రం తీసిపోకుండా సాలీడు నిర్మించుకున్న గూడుకు ప్రకృతి మంచు బిందువులతో వన్నెలద్దింది. సాలిగూడుపై మంచు బిందువులు ముత్యాలను తలపించగా, వాటిపై పడిన అరుణ కిరణాలు మరింతగా అందానిచ్చాయి. రాయవరం–వెదురుపాక రహదారిని ఆనుకుని పొదలపై ఉన్న ఈ సాలిగూడులు ప్రకృతి ప్రేమికుల మనస్సులను దోచుకున్నాయి.

– రాయవరం



మంత్రి వేణును కలసిన కుడుపూడి



మంత్రి వేణును మర్యాద పూర్వకంగా కలసిన సూర్యనారాయణ

రామచంద్రపురం: రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని మంత్రి వేణు క్యాంపు కార్యాలయానికి సూర్యనారాయణ విచ్చేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇరువురు ప్రభుత్వం బీసీలకు అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు వాసంశెట్టి తాతాజీ, గుత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ దక్షగుండం వద్ద వేంచేసిన గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 41వ కల్యాణం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దమరసింగు సత్యవతి ఆధ్వర్యంలో అత్తిలి శివరామకృష్ణ, కొడమంచిలి సత్యనారాయణల బ్రహ్మత్వంలో కల్యాణ క్రతువును వేద మంత్రోచ్ఛారణ నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారి, ద్రాక్షారామ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, ద్రాక్షారామ సంఘం ప్రధాన కార్యదర్శి దాకోజు శ్రీనివాస్, గౌవవాధ్యక్షుడు గారోజు సూరిబాబు, నెల్లూరి సత్యశ్రీనివాసరావు, కాల్దారి వెంకటేశ్వరరావు, భరణికల సత్యనారాయణ, ఎంపీటీసీ కణితి వెంకటేశ్వరి, ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ద్రాక్షారామలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక

151 మందికి వైద్య పరీక్షలు



తాతపూడిలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం తాతపూడిలో 151 మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర్ బాలికలను పరీక్షించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. బయటకు రాలేని వృద్ధులను వారి ఇంటికి వెళ్లి పరీక్షించారు. శిబిరాన్ని సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ జిత్తుక వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు సందర్శించారు. హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ కె.దీప్తి, 104 సిబ్బంది, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



రథోత్సవం కోసం రోడ్డును శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

మండపేట: ఏడిద సంగమేశ్వరంలో ఉన్న స్వయంవర పార్వతీ సంగమేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవానికి ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. సంగమేశ్వరం నుంచి గ్రామంలోకి రథోత్సవం జరిగే రోడ్డులో తుప్పలు, పొదలు లేకుండా జేసీబీతో శుభ్రం చేయించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రామిశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, ఆలయ సెక్రటరీ పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగమేశ్వరస్వామి వారి రథోత్సవం నేపథ్యంలో మండపేట సబ్‌డివిజన్‌లోని మండపేట, ద్వారపూడి, ఆలమూరు సెక్షన్ల పరిధిలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఏడీఈ తిరుమలరావు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'పొలంబడి' ని సద్వినియోగం చేసుకోవాలి



పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్న గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14 వారాల డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని మాలపాడులో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ జి.భవాని, రైతులు పాల్గొన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన అన్నపూర్ణా, విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం నేటి రాత్రి 8.32 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. స్వామి కల్యాణ వేడుకలు ఈ నెల 16 నుంచి 21 వరకు జరుగుతాయని వివరించారు. 16న ఉదయం 9 గంటలకు కల్యాణ మూర్తులను చేయడం, సాయంత్రం 3 గంటలకు ధ్వజారోహణం, స్వామివారి నగరోత్సవం, రాత్రి 8.32 గంటకుల దివ్య కల్యాణం, 17న సాయంత్రం 4 గంటలకు నగరోత్సవం, 18న మహాశివరాత్రి సందర్భంగా సాయంత్రం 4 గంటలకు ఆవునెయ్యితో స్వామికి అఖండ దీపారాధన, సదస్యం, 19న సాయంత్రం 4 గంటలకు స్వామి నగరోత్సవం, 20న ఉదయం 7 గంటలకు స్వామి వార్లకు నాగబలి, త్రిశూలస్నానం, వసంతోత్సవం, 21న రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

35 మంది గురువులకు పాద పూజ

అంబాజీపేట: గురుసేవా విశిష్ట విమలాంబ వీరవరపు సుబ్బాయమ్మ గురు మాతాజీ ప్రథమ వార్షికారాధనలో భాగంగా అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో గురువారం 35 మంది గురువులకు పాద పూజ చేశారు. విశాఖపట్నం, పైడికొండ గ్రామంలో ఉన్న శివరామ దీక్షితుల పీఠంలో చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ రాష్ట్ర నలుమూలల పర్యటించి ఎంతో మంది శిష్యులను, భక్తులను సంపాదించుకున్నారని అమ్మగారి కుటుంబ సభ్యులు, శిష్యబృందం తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత మాతాజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

సేంద్రియ ఎరువులకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. బుధవారం మండలంలోని తణుకువాడలో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయనిక ఎరువుల రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుడటంతో పంటల సేద్యంలో వ్యయాలు అధికమవటమే కాకుండా పంట ఉత్పత్తులు విషతుల్యమై అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం కషాయం వంటివి తయారుచేసి పంటలకు సోకే పలురకాల తెగుళ్లపై వినియోగించవచ్చన్నారు. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఆత్మపథకం ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నారన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు డీవీ రమణ, వాసంశెట్టి శ్రీనివాస్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో బుధవారం లక్షతులసి పూజ జరిగింది. ఆలయ పురోహితులు సూర్యనారాయణాచార్యుల నేతృత్వంలో అర్చక బృందం వేద పండితులు పొలమూరి మధ్వాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ పూజను తిలకించారు.